సాక్షి
పల్నాడు
ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



కాళికాంబకు విశేష పూజలు

కర్లపాలెం: స్థానిక కాళికాంబ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం ముందు 11కేజీల కర్పూరాన్ని వెలిగించారు.



కార్తిక మాస హోమాలు

తెనాలి: స్థానిక మారిస్‌పేటలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కోసూరి శివరామకృష్ణ కుటుంబం రూ. 1,01,116 అందజేశారు.

న్యూస్‌రీల్

అటవీశాఖ సిబ్బంది వన సమారాధన



వినుకొండ (నూజెండ్ల): జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వినుకొండ నగరవనంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్, అధికారులంతా సహపంక్తి భోజనం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఆగస్టు 30 నుంచి వన సమారాధన వరకు విస్తృతంగా మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని జిల్లాల అధికారులకు ఆదేశం చారని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భ్రమరాంబికాదేవికి వెండిహస్తాలు వితరణ



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని అమ్మవారికి మిర్యాల గ్రామానికి చెందిన అలవాల నర్సిరెడ్డి, మంగమ్మ, శ్రీనివాసరెడ్డి, అరుణ, నీరజ్ రెడ్డి, నిఖిలారెడ్డి దంపతులు వెండి హస్తాలు శనివారం అందజేశారు. కార్తికమాసం సందర్భంగా శనివారం దేవస్థానంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వారికి మహాన్నదానం చేశారు. స్వామివార్లకు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించి దేవస్థానం ఆవరణలో హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెండి హస్తాలు వితరణ ఇచ్చిన వారికి ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అర్చకులు మల్లికార్జునశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వేదశ్రీకి పతకం



చీరాల టౌన్: సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని త్రిపురం వేదశ్రీ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. నవంబర్ 24 నుంచి 27 వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో పోటీలు నిర్వహించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలో వేదశ్రీ మొత్తం 227.5 కిలోలు బరువు ఎత్తి తృతీయ స్థానంలో నిలిచింది. 69 కేజీల విభాగంలో స్క్వాట్ 95 కిలోలు, బెంచ్‌ప్రెస్ 47.5 కిలోలు, డెడ్ లిఫ్ట్ 85 కిలోలు బరువుతో అందరిని ఆకట్టుకుంది. ఆమెను శనివారం బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, సెక్రటరీ ప్రసాద్, జిల్లా చైర్మన్ తాడివలస దేవరాజ్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ అంబేశ్వరరెడ్డి ఉన్నారు.

రైతు నెత్తిన ఎరువుల భారం

మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది రైతుల పరిస్థితి. ఒక వైపు నకిలీలు..మరో వైపు ప్రకృతి వైపరీత్యాలు...ఇంకొక వైపు గిట్టుబాటు ధర లేక రైతులు వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారు. భూమినే నమ్ముకున్న కొంతమంది భారంగానే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం వారిపైన మరింత భారాన్ని మోపింది. ఎరువుల ధరలు పెంచింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఒక్కో బస్తాపై ధర రూ.100-150 వరకు పెంపు
- ఎరువుల సబ్సిడీకి మంగళం పాడిన కూటమి సర్కారు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచిన కూటమి ప్రభుత్వం



ఎరువుల బస్తాలు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల సబ్సిడీ పెంచకపోగా... ఒక్కో బస్తాపై ఏకంగా రూ.100 నుంచి రూ.150 వరకు పెంచడంతో రైతన్నలపై తేరుకోలేని భారం పడింది. పంటలకు ఎరువులు వేయాలంటేనే రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ ఇచ్చి ఆదుకునేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

3,02,972 హెక్టార్లలో సాధారణ సాగు

జిల్లాలో ఖరీఫ్, రబీ కలిపి సాధారణ సాగు 3,02,972 హెక్టార్లు కాగా, 1,89,316 హెక్టార్లలో వివిధ పంటలు రైతులు సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరి, పత్తి, మిరప సాగు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ కలిపి జిల్లా వ్యాప్తంగా 3,42,735 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయ అధికారుల అంచనా. దీనిలో యూరియా 1,40,850 మెట్రిక్ టన్నులు, డీఏపీ 62,385 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 16,210 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 1,12,990 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 5 వేల మెట్రిక్ టన్నులు, ఏఎస్ 5,300 మెట్రిక్ టన్నులు ఎరువులు వినియోగించనున్నారు.

వ్యాపారుల దందా...

కూటమి ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువుల బస్తాపై రూ.100-150 పెంచగా డీలర్లు ధరల పెంపు ముసుగులో దందా చేస్తున్నారు. ఒక్కో బస్తాపై మరో రూ.50 పెంచి అధికంగా వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా డిమాండ్ ఉన్న 28.28.0.13, 14.35.14, 10.26.26.0 ఎరువులపై అదనంగా వడ్డిస్తున్నారు. అసలే పండించిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారు. వర్షాభావం, తెగుళ్ల బెడదతో రైతులకు అరకొరగా దిగుబడి వచ్చింది. పత్తి, మిరప పంటలు సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం, డీలర్లు దోపిడీకి పాల్పడటంపై రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

జిల్లా రైతులపై రూ.10 కోట్ల భారం

పంటల సాగుకు అధికంగా కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సి వస్తోంది. యూరియా మినహా ప్రతి కాంప్లెక్స్ ఎరువుపై కూటమి ప్రభుత్వం ధరలు పెంచేసింది. కాంప్లెక్స్ సరఫరా చేసే ఎరువుల కంపెనీలకు సబ్సిడీ పెంచకపోవడంతో ఆ భారం అంతా రైతుల నెత్తిన పెట్టారు. కారణంగా రైతులు ఎరువులు కొనలేక నానా తంటాలు పడుతున్నారు. ఏకంగా రూ.100-150 పెంచడంతో రైతులకు భారంగా మారింది. జిల్లా రైతులపై దాదాపు రూ.10 కోట్లకు పైగా భారం పడుతోంది.

పెరిగిన ఎరువుల ధరలు ఇలా..


ఎరువులు	పాతధర(రూ.)	కొత్త ధర(రూ.)
28.28.0.	1,680	1,800
14.35.14.	1,680	1,800
20.20.0.13.	1,100	1,300
10.26.26.	1,370	1,470
16.20.0.13	1,100	1,250
24.24.0.08.	1,700	1,800
పొటాష్	1,550	1,650
యూరియా	266.5	266.5
డీఏపీ	1,350	1,450

భారం మోయలేం



మూడెకరాలలో మిరప పంట వేశాను. ఎరువులు కొందామని దుకాణానికి వెళితే ధరలు పెరిగినట్లు చెప్పారు. ధరలు ఈ రకంగా పెరిగితే రబీలో పంటలు ఎలా పండించాలి. అప్పులు చేసి పంటలు పండిస్తే వచ్చిన ఆదాయం వడ్డీలకే సరిపోతుంది.
–బొడ్డుపల్లి హనుమంతరావు, రైతు, రాజుపాలెం

పంట వేయాలంటే భయం



పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్నాం. ఈ సమయంలో ఎరువుల ధరలు పెంచడం భావ్యం కాదు. రబీలో పంట వేయాలంటేనే భయమేస్తుంది. నేను వరి పంట పండించాను. రబీలో కూడా వరి పంట వేయాలి. పెరిగిన ఎరువుల ధరలతో పంటలు ఎలా పండించాలి.
–కొర్రకూటి గోవిందు, రైతు ,పెదనెమలిపురి



సాగులో ఉన్న వరి పంట

పోస్టల్ శాఖలో సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు కృషి

కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



చిలకలూరిపేట:పోస్టల్‌శాఖలో సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు కృషి చేస్తానని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. చిలకలూరిపేట పట్టణంలో హెడ్ పోస్టాఫీస్ భవన నిర్మాణానికి మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పోస్టాఫీసుల ద్వారా అందే సేవలు పారదర్శకంగా ఉండేందుకు పార్సిళ్లకు ట్రాకింగ్ విధానం తీసుకువస్తామన్నారు. ఏపీ పోస్టల్ సర్కిల్ దేశంలో మొదటి స్థానంలో ఉండటం అభినందనీయమన్నారు. అవినీతి లేకుండా ప్రజలకు పోస్టల్ శాఖ మాత్రమే సేవలు అందిస్తున్నదని కొనియాడారు. కాలానుగుణంగా పోస్టల్ శాఖ ప్రజలకు వినూత్న సేవలు అందిస్తున్నదని వెల్లడించారు. కొండవీడు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. యర్రగొండపాలెంలో నూతనంగా నిర్మించిన పోస్టాఫీస్ భవనాన్ని, ప్యాపిలీలో నిర్మించనున్న పోస్టాఫీస్ భవనానికి శంకుస్థాపనను మంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఏపీ రీజియన్‌లో 15 లక్షల అకౌంట్లు కలిగి ఉండి బ్యాంకింగ్ సేవలు అందించటం అభినందనీయమ న్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం వద్ద టెక్స్‌టైల్ పార్కును పరిశీలించారు. పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే పి.పుల్లారావు, కలెక్టర్ పి అరుణ్ బాబు, ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె ప్రకాష్, విజయవాడ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు.

పింఛన్లకు కూటమి కోత

- నెలనెలా తగ్గుతున్న పింఛన్లు
- డిసెంబరులో 861 మందికి కోత
- ఆరు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 7917 తగ్గింపు

నరసరావుపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా కోత పడుతూనే ఉంది. ఆరు నెలల కాలంలో జిల్లాలో 7917 మందికి కోత పడింది. రాజకీయ, ఇతర కారణాలతో సామాజిక భద్రతా పింఛన్లను తగ్గిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబరు నెలలో 861మందికి పింఛన్ సొమ్ము అందలేదు. కూటమి ప్రభుత్వం ప్రతినిధిగా నారా చంద్రబాబునాయుడు జూన్ 12వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. జూన్‌కు సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంపికచేసిన లబ్ధిదారులకే జూలై నెలకు పింఛన్ సొమ్ము మంజూరైంది. నూతన ప్రభుత్వం జూలై మాసానికి జిల్లాలో 2,82,126మందికి అన్ని రకాల పింఛన్లు పెంచి అందజేస్తున్నట్లు ప్రకటించింది. ఆరో నెల డిసెంబరు వచ్చేసరికి వాటి సంఖ్య 2,74,209కి చేరింది. ఆరు నెలల వ్యవధిలో పింఛన్‌దారుల సంఖ్య సుమారుగా 7,917 తగ్గింది. వీరిలో కొంతమంది చనిపోయారనుకున్నా అంతమంది తగ్గే అవకాశం లేదు. జూలై, నవంబరు, డిసెంబరు నెలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా పింఛన్లు పొందిన లబ్ధిదారుల సంఖ్యలో వచ్చిన తేడా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

93.55 శాతం పంపిణీ

డిసెంబరు నెలకు సంబంధించిన ఫించన్లు శనివారం ఉదయం నుంచి పంపిణీ ప్రారంభించారు. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో శనివారం సాయంత్రం 5.40 గంటలకు 93.55శాతం మందికి పింఛన్ల పంపిణీ చేశారు. నరసరావుపేట పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు స్థానిక నాయకులు పాలుపంచుకున్నారు.



పట్టణంలో లబ్ధిదారునికి పింఛన్ అందజేత

పింఛన్ల తగ్గింపు వివరాలు ఇలా...

నియోజకవర్గం	జూలై	నవంబరు	డిసెంబరు
చిలకలూరిపేట	37,982	37,090	36,984
గురజాల	44,026	42,921	42793
మాచర్ల	43,520	42,370	42,217
నరసరావుపేట	33,622	32,824	32,719
పెదకూరపాడు	40,264	39,248	39,117
సత్తెనపల్లి	40,559	39,538	39,427
వినుకొండ	42,153	41,079	40,952
మొత్తం	2,82,126	2,75,070	2,74,209

ప్రారంభమైన పల్నాటి వీరారాధన ఉత్సవాలు

- ఎర్ర జెండా ప్రతిష్టించి ఉత్సవాలను ప్రారంభించిన పీఠాధిపతి
- ముగిసిన రాచగావు క్రతువు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కార్యమపూడి (కారెంపూడి)లో పల్నాటి వీరుల ఆరాధన ఉత్సవాలు కార్తిక అమావాస్య శనివారం ప్రారంభమయ్యాయి. వీరుల గుడికి ఎరుపు తెలుపుచారలతో వెల్ల వేశారు. తర్వాత ఆయుధాలను బయటకు తీసి గుడి మొత్తాన్ని శుద్ధి పరచారు. ఆయుధాలను కూడా కడిగి శుభ్రం చేశారు. మరో వైపు వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు ఒక్కొక్కరుగా వీరుల గుడి ప్రాంగణానికి చేరుకుంటున్నారు. వచ్చిన వారు ముందుగా కళ్లి పోతురాజు దర్శనం చేసుకుని అక్కడ నుంచి వీరుల గుడికి చేరుకుని నాగులేరు గంగధారిలో తమ ఆయుధాలను శుద్ధి పరుచుకున్నారు. అనంతరం రాత్రి వీరుల ఆయుధాలకు నూతన వస్త్రాలతో అలంకరించుకుని ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి వెళ్లి ఆయనను ఊరేగింపుగా తీసుకుని వీరుల గుడి ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం రాత్రి వీరుల గుడి ముఖ మండపంపై పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఎర్రజెండాను ప్రతిష్టించారు. తర్వాత వచ్చిన వీరాచారులకు పీఠాధిపతి వీరుల గుడికి తూర్పున ఉన్న మండపంలో కంకణాల ధారణ చేశారు. రణక్షేత్రం ఉత్సవశోభను సంతరించుకుంది. వీరుల గుడి ప్రాంగణమంతా సందడిగా మారింది. అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామి దేవాలయం, ఇతర పల్నాటి చారిత్రక చిహ్నాలకు ఆకర్షణీయంగా ఎరుపు తెలుపు చారలతో సంప్రదాయ రంగులు వేశారు. చెన్నకేశవుని నూతన వస్త్రాలతో అలంకారం చేశారు.



వీరుల గుడిపై ఎర్ర జెండా ప్రతిష్టిస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

ముగిసిన తొలి ఘట్టం రాచగావు

తొలి రోజు 'రాచగావు'తో ప్రారంభమైంది. పోతురాజుకు దిబ్బం పెట్టి వీరుల ఆత్మశాంతికి ముద్దలు సమర్పించారు. వీరుల గుడి పూజారులు పోతురాజు ఆచారవంతునితో కలసి పోతురాజుకు గావు చెల్లించారు. ప్రస్తుతం జంతుబలులపై నిషేధం ఉన్న కారణంగా అన్నం ముద్దలను నెత్తురులో కలిపి పోతురాజుకు తర్వాత వీరుల ఆత్మలకు ముద్దలుగా చేసి అర్పించారు. రాత్రి బాగా పొద్దుపోయాక రాచగావు కథను దర్శి ముక్కంటి అనే వీరవిద్యావంతుడు ఆలపించారు. నేడు ఆదివారం 'రాయబారం' చారిత్రక ఘట్టం పేరుతో ఉత్సవం జరగనుంది.

ప్రారంభమైన ఎడ్ల పోటీలు

రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు వీరుల గుడికి తూర్పు వైపు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ ప్రాంతంలో ప్రారంభమయ్యాయి. పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. క్రికెట్ పోటీలను ప్రారంభించారు.

పోలీసుల్లో క్రీడా ప్రతిభకు స్పోర్ట్స్ మీట్ దోహదం

జిల్లా స్థాయి స్పోర్ట్స్-గేమ్స్ మీట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలు

నరసరావుపేట: పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోడెల శివప్రసాదరావు క్రీడా(డీఎస్ఏ) మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ – గేమ్స్ మీట్ పోటీలను శనివారం జిల్లా క్రీడల జెండా ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించి, కలర్ బెలూన్లు ఆకాశంలోకి విడుదల చేసి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయని చెప్పారు. 24 గంటలూ విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు వారిలో ఉన్న క్రీడా ప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీస్ మీట్‌కు పంపిస్తామన్నారు. పిల్లల్ని కూడా గేమ్స్ ఎక్కువగా ఆడించాలని దాని ద్వారా వారు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవుతారని అన్నారు. శని, ఆదివారాల్లో వరుసగా రెండు రోజులపాటు నిర్వహించే ఈ స్పోర్ట్స్ మీట్‌లో నాలుగు జోన్లకు సంబంధించిన గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నాలుగు టీమ్‌లు పోటీల్లో పాల్గొంటాయని తెలియజేశారు. క్రీడాకారులు గేమ్ స్పిరిట్‌తో పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి. జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, పీఈటీ మాస్టర్లు పాల్గొన్నారు.



పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాజ్యోతి వెలిగిస్తున్న జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ, అధికారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ

ఉమ్మడి జెడ్పీ వార్షిక బడ్జెట్ రూ.643.80 కోట్లు

- 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలకు స్థాయీ సంఘం ఆమోదం
- త్వరలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి బడ్జెట్ ప్రతిపాదనలు
- రూ.తొమ్మిది కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆమోదం
- ఏడాది గడిచినా ప్రారంభం కాని పనులు రద్దుకు నిర్ణయం

గుంటూరుఎడ్యుకేషన్: ఏడు స్థాయీ సంఘాలకు గాను ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఆమె చాంబర్లో నిర్వహించారు. వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం సమావేశం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం సమావేశం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధల అధ్యక్షతన జరిగాయి.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

వార్షిక బడ్జెట్ ఇదీ..

2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643.80 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో జెడ్పీ సాధారణ బడ్జెట్ రూ.71.11 కోట్లు. మిగిలిన రూ.572.69 కోట్లు పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు సంబంధించినవి. పీఆర్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల వార్షిక బడ్జెట్ అంచనాలను జెడ్పీ ఆమోదించాల్సి ఉండటంతో స్థాయీ సంఘ సమావేశంలో ప్రవేశపెట్టారు.

గ్రామాల్లో పనులపై దృష్టి

జెడ్పీటీసీల విజ్ఞప్తి మేరకు రూ.9 కోట్ల వ్యయంతో గ్రామాల్లో 108 అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశంలో ఆమోదించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రజా అవసరాల మేరకు గతంలో ఆమోదించిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని ఆయా శాఖల అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. టెండర్లు దక్కించుకుని, ఏడాది గడిచినా ప్రారంభించని అభివృద్ధి పనులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సంబంధిత పనులకు తాజాగా అంచనాలు సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా 35 మండల పరిషత్‌లకు చెందిన వార్షిక బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. కాగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతోపాటు వివిధ శాఖల వారీగా గతంలో కేటాయించిన అభివృద్ధి పనులకు సంబంధించి ఏడాది గడిచినా పనులు ప్రారంభానికి నోచుకోని విషయాన్ని గుర్తించారు. ప్రగతిని ఆయా శాఖల అధికారులు వివరించారు. సీఈవో వి.జ్యోతిబసు ఉన్నారు.

4న కాంట్రాక్టు అధ్యాపకుల సత్యాగ్రహ దీక్ష

గుంటూరుఎడ్యుకేషన్:ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 4న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారు. ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్ఆర్ శర్మ, బీజే గాంధీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు తెచ్చిన జీవో నెం.114 అమల్లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోగా, అధ్యాపకులు నోచుకోలేదన్నారు. అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని వాపోయారు.

క్లుప్తంగా

భార్య మందలించిందని

చిలకలూరిపేటటౌన్: భార్య మందలించిందని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక బచ్చు ఆదినారాయణ వీధిలో నివాసం ఉంటూ ప్లంబర్ వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న బూసి రత్నం(45) భార్యా భర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపం చెందిన రత్నం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం భోజనానికి వచ్చిన రత్నం పెద్ద కుమారుడు రాజు ఇంటి తలుపు తెరిచి చూడగా తండ్రి ఆత్మహత్య చేసుకోవడం గమనించాడు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పరిశుభ్రతకు రైల్వే శాఖ ప్రాధాన్యం



లక్ష్మీపురం: ప్రయాణికులకు వసతుల కల్పనలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 4 రైళ్లకు బెడ్‌రోల్స్ సరఫరా అవుతున్నాయని, వాటితోపాటు దుప్పట్లను ప్రతి నెలా శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు మెరుగైన అవకాశాలు

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు

నరసరావుపేట: రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. స్థానిక టౌన్‌హాలు ప్రాంగణంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)తోపాటు సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ లావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు చైతన్యమైనట్లు మరే రాష్ట్రంలో కాలేదన్నారు. ఆ రాష్ట్రంలో కుటుంబ స్త్రీ పేరుతో గ్రామాలు, పట్టణాల్లో రోడ్లు, కుళాయిల ఏర్పాటు టెండర్లలో కూడా మహిళలు పాల్గొంటున్నారన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం ఇస్తారని, దీనిలో 35శాతం వరకు సబ్సిడీ లభిస్తుందన్నారు. చిన్న తరహా పరిశ్రమల వలన ఎక్కువ మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. ఇటువంటి పరిశ్రమలు నెలకొల్పేందుకు జిల్లాలో చాలా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా వెనుకబడిన ప్రాంతమని, జిల్లాలో కష్టపడి పనిచేసే వారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. వారందరికి ఉపాధి చూపించాలంటే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకర్లు కూడా సహకరించాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ద్వారా అధిక మంది లబ్ధిపొందేందుకు సహకారం అందజేస్తామన్నారు. తొలుత టౌన్‌హాలు ప్రాంగణంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పలు స్టాళ్లను పరిశీలించారు. చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు, ఎస్‌బీఐ బ్యాంకు శాఖల ప్రతినిధులు పరిశ్రమలకు తాము ఇచ్చే రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఆర్డీఓ కె.మధులత, ఎల్‌డీఎం రామ్‌ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, పరిశ్రమల శాఖ ఏడీ నవీన్ పర్యవేక్షించారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు, అంగన్‌వాడీ మహిళలు పాల్గొన్నారు.

ఆరు పళ్ల ఎడ్ల విజేత పెదపరిమి, తుళ్లూరు జత

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలలో ఆరు పళ్ల విభాగంలో తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగల రామిరెడ్డి, కొల్లిపరకు చెందిన గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి కంబైన్డ్ జత 3,200 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 2,812 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత తృతీయ స్థానాన్ని, గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి, ధరణి ఎడ్ల జత 4వ స్థానంలో నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 5వ స్థానంలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రెడ్డిపాలెంకు చెందిన పిడవర్తి శ్రీనివాసరెడ్డి, జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్ల జత 6వ స్థానంలో నిలిచాయి. మొత్తం ఏడు జతలు పాల్గొనగా ఆరు నగదు బహుమతులు షీల్డ్‌లను బహూకరించారు. విజేతలకు నగదు బహుమతులను దాతలు పంగులూరి అంజయ్య, ప్రజ్వల్ సీడ్స్, లిటిల్ హైబ్రిడ్ సీడ్స్, లీలాలక్ష్మి తండా చిన సైదా, ముద్దంగుల బాల వెంకటేశ్వర్లు, మహంకాళి శ్రీను, ఉన్నం శ్రీనివాసరావు, కిల్లి సాంబయ్య, వల్లెపు బాబులు అందించారు. కారెంపూడి రైతు సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామర్థ్యాలకు అనుగుణంగా బోధన

- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి
- సత్తెనపల్లి కేజీబీవీ ఆకస్మిక సందర్శన



సత్తెనపల్లి కేజీబీవీలో విద్యార్థినుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న దేవానందరెడ్డి

సత్తెనపల్లి: విద్యార్థినుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి అన్నారు. సత్తెనపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. దేవానందరెడ్డి మాట్లాడుతూ తరగతుల వారీగా విద్యార్థినిల సామర్థ్యాన్ని గుర్తించి ఆ మేరకు వారికి అర్థమయ్యే రీతిలో బోధించడానికి వీలుగా బోధనా పద్ధతులను మార్పులు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతి విద్యార్థులకు డిక్టేషన్ పరీక్ష నిర్వహించి, వారి ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసి నైపుణ్యాలను పరీక్షించారు. 9వ తరగతి విద్యార్థినిలకు సాంఘికశాస్త్రం నుంచి ఒక టాపిక్ (భారతదేశ జనాభా పరిమాణం, విస్తరణ) ఇచ్చి గంట సేపు చదవమని సూచించారు. చదవడం పూర్తయిన తర్వాత ఆ పేజీలో వారు అర్థం చేసుకున్న విషయాలను వ్యక్తపరచమని అడిగి వారి రీడింగ్ ఎబిలిటీ (చదవగలడం), ఎక్స్‌ప్రెషన్ ఎబిలిటీ (అభిప్రాయాలను వ్యక్తపరచడం) ఆవశ్యకతపై దృష్టి సారించారు. పుస్తకంలోని విషయాలను ఎలా గ్రహించి ప్రజెంట్ చేయాలో విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు స్లిప్ టెస్ట్ నిర్వహించారు. వారి సామర్థ్యాలను ఎలా పెంచాలనే దిశగా ఉపాధ్యాయుల సమక్షంలో సమీక్ష చేశారు. ముందుగా విద్యాలయంలో సౌకర్యాలను పరిశీలించి విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 ఎ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి-2 ఏ రాఘవేంద్ర రావు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ ప్రత్యేక అధికారిణి ప్రసన్నకుమారి, ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు, తదితరులు ఉన్నారు.

8న క్రీడా గయన్ పరీక్ష

నరసరావుపేట ఈస్ట్: చైతన్య కశ్యప్ క్రీడా భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4వ ఆన్‌లైన్ క్రీడా గయన్ పరీక్షను డిసెంబర్ 8వతేదిన నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, 12సంవత్సరాలు వయస్సు పైబడిన ఎవరైన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని పరీక్షలో పాల్గొనవచ్చని వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు http://kreedabharati.org ఆన్‌లైన్ లింక్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ కంప్యూటర్, మొబైల్‌లో పరీక్ష రాయవచ్చన్నారు. పరీక్షా సమయం 25నిమిషాలు, 50 ప్రశ్నలు ఉంటాయని వివరించారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.లక్ష (ఒకరికి), ద్వితీయ బహుమతి రూ.50వేలు (ఇద్దరికి), తృతీయ బహుమతి రూ.25వేలు (ఆరుగురికి), నాల్గవ బహుమతి రూ.11వేలు (11మందికి) లభిస్తాయని తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులకు 15శాతం అదనపు ధర



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ సర్టిఫికేషన్ చేయించుకున్న ఉత్పత్తులకు మార్కెట్ ధర కన్నా 15 శాతం అదనపు ధర లభిస్తుందని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని అంజిరెడ్డి సమావేశ మందిరంలో వ్యవసాయ సిబ్బంది శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈఏడాది 32,513మంది రైతులు 42,113 ఎకరాల్లో 30 రకాల విత్తనాలు(పీఎండీఎస్) వేయడం జరిగిందన్నారు. ఆయా రైతులు ప్రస్తుతం ప్రధాన పంటలైన వరి, మిరప, కంది, కూరగాయలు సాగు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రైతులను భాగస్వామ్య హామీ విధానం(పీజీఎస్) గ్రూపులుగా చేస్తున్నట్టు తెలిపారు. ఈ సర్టిఫికేషన్ లభించడం వలన రైతులకు మార్కెట్ ధర కన్నా అదనంగా ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా పెట్టుబడులు తగ్గడమే కాకుండా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌పై ఆంధ్ర జట్టు ఆధిక్యం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కూచ్ బెహరా ట్రోఫీలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టుపై ఆంధ్ర జట్టు ఆధిక్యం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు 80 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 70.01 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. బ్యాట్స్‌మెన్ అరవ్ మహిపాల్ 103 పరుగులు సాధించగా, బౌలర్లు ఎన్.రాజేష్ 6 వికెట్లు, ఏవీఎన్ లోహిత్ 4 వికెట్లు సాధించారు.

వికాస కార్యవర్గం ఏకగ్రీవం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పోటీలో ఫ్రెండ్స్ ప్యానెల్ చెందిన అభ్యర్థులే ఉండటంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్ మురళీ మోహన్ శనివారం ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దాసరి విజయప్రకాష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా నేలపాటి నాగేశ్వరరావు, తోట వెంకటేష్, కోశాధికారిగా కె.యేషయ్య, కార్యవర్గ సభ్యులుగా చిమట ఆనంద్ కుమార్, పి. నాగరాజు, సీహెచ్.సాంబశివరావు, కేతావత్ శ్రీధర్, జి.శ్రీను, నల్లగొర్ల శ్రీనివాసరావు, ఈ శ్రీనివాసరెడ్డి, టంకశాల వెంకటేశ్వరరావు, నూతక్కి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యవర్గానికి వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందనలు తెలిపారు.

ఫొటోలు వాస్తవాలకు ప్రతిబింబాలు



బహుమతులు పొందిన ఫొటోగ్రాఫర్లు

ఏఎన్‌యూ : ఫొటోలు వాస్తవాలకు ప్రతిబింబాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాలు సంయుక్తంగా శనివారం వర్సిటీలో నిర్వహించిన 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవాలకు చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జర్నలిజం విభాగం ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె. మధుబాబు అధ్యక్షత వహించారు. ఆచార్య కె. రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ రంగం ఎంతో అభిలాషతో కూడుకున్నదని తెలిపారు. దానికి తగినట్లుగా వాస్తవాలను ప్రతిబింబించేలా ఫొటోలు ఉండాలన్నారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీకి సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్.పాల్ కుమార్, ఫొటోగ్రఫీ అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, వైద్య నిపుణులు, ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఫొటోగ్రఫీలో నైపుణ్యాల ప్రదర్శించిన రెండు తెలుగు రాష్ట్రాలకు 25 మందికి బహుమతులు ప్రదానం చేశారు.

తెనాలి ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం

తెనాలి: తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్, తెనాలి కెమెరా క్లబ్ కార్యదర్శి ఓలేటి రవికుమార్ తీసిన 'రెస్ట్ టైం' ఫొటోకు కెప్టెన్ టీఎఫ్ గెటి స్మారక అవార్డు లభించింది.